సాక్షి
చిత్తూరు
మంగళవారం । 17 । సెప్టెంబర్ । 2024



లింకు నొక్కితే.. ఖాతా ఖాళీ!

స్మార్ట్ ఫోన్లకు వచ్చే లింకులను నొక్కితే, బ్యాంకు ఖాతాను ఖాళీ చేసే సైబర్ దొంగలతో అప్రమత్తంగా ఉండాలి. - 8లో



వరుణుడి జాడేది?

ఐరాల మండలంలో వరుణుడి జాడలేక చేతికంది వచ్చిన వేరుశనగ పంట ఎండుముఖం పడుతోంది. - 8లో

బాల్ బ్యాడ్మింటన్‌లో అగ్రస్థానం



కాకినాడలో జరిగిన అంతర జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో చిత్తూరు జిల్లా బాలుర జట్టు ప్రథమ స్థానంలో నిలిచి, జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. - 8లో

న్యూస్‌రీల్

నేడు విశ్వకర్మ జయంతి వేడుకలు

చిత్తూరు కలెక్టరేట్ : విశ్వకర్మ జయంతి వేడుకలను ఈ నెల 17న కలెక్టరేట్‌లో అధికారికంగా నిర్వహించనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ శాఖ డీడీ రబ్బానీబాషా తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాదిలో జారీ చేసిన జీఓ ప్రకారం ఏటా సెప్టెంబర్ 17న విశ్వకర్మ జయంతిని రాష్ట్ర వేడుకగా నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఉదయం 10.30 గంటలకు నిర్వహించే వేడుకకు సంఘాల నాయకులు, అధికారులు హాజరుకావాలని డీడీ కోరారు.

108లో ఉద్యోగ అవకాశాలు

సదుం: 108లో ఖాళీగా ఉన్న ఈఎంటీ (ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మేనేజరు మోహన్‌బాబు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ జగదీష్ బాబు ఒక ప్రకటనలో కోరారు. అన్ని మండలాలకు సంబంధించిన అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. బీఎస్సీ నర్సింగ్, లైఫ్ సైన్స్, బీఫార్మసీ, బీఎస్సీ ఎంఎల్‌టీ చదివిన వారు అర్హులన్నారు. దరఖాస్తులను ఈనెల 19 లోపు చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని 108 కార్యాలయంలో నేరుగా అందించాలని సూచించారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పోడియం తొలగింపు



పుంగనూరులో పోడియం తొలగిస్తున్న సిబ్బంది

చిత్తూరు కార్పొరేషన్: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉండే పోడియాలను తొలగించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మూడు రోజులుగా సెలవులు రావడంతో కార్యాలయాల్లో ఉన్న పోడియంలను తీసివేశారు. పరిపాలన సౌలభ్యం మేరకు ఈ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చారని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వానికి ఆదాయాన్ని అందించే శాఖల్లో రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఇక సాధారణంగా సబ్‌రిజిస్ట్రార్లు టేబుల్ వద్ద కూర్చొని విధులు నిర్వర్తించాల్సి ఉంది. సాధారణంగా కోర్టుల్లో జడ్జిల ముందు పోడియం ఉంటుంది. ఆ తర్వాత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దర్శనమిస్తుంది.

పేదలకు వైద్య విద్యను దూరం చేసే కుట్ర



పేద, మధ్య తరగతి నిరుపేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేందుకు కుట్ర చేస్తున్నారు. గత ప్రభుత్వం పేద విద్యార్థులకు వైద్య విద్యను దగ్గర చేసింది. అయితే కూటమి ప్రభుత్వం కార్పొరేట్‌కు మేలు కలిగేలా నిర్ణయాలు తీసుకుంటున్నారు. మాలాంటి పేద పిల్లలు వైద్య విద్య చదువుకోకూడదా? గత ప్రభుత్వం 17 వైద్య కళాశాలలకు శ్రీకారం చుట్టింది. ఇందులో ఐదు కళాశాలలను ప్రారంభించింది. మరో ఐదింటి నిర్మాణాలను పూర్తి చేసింది. ఏడు కళాశాలలు నిర్మాణ దశలో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేయాలనుకోవడం చాలా దారుణం.

– పురుషోత్తం, నీట్ విద్యార్థి, చిత్తూరు



మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ సరికాదు



ఈ విద్యాసంవత్సరంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలను కోవడం సరైన పద్ధతి కాదు. రాష్ట్రంలో వెంటనే కొత్తగా నిర్మాణాలు పూర్తయిన 5 కళాశాలలను ప్రారంభించి తీరాలి. ఆ కళాశాలలు ప్రారంభిస్తే ఒక్కో కళాశాలకు 150 సీట్లు చొప్పున మంజూరవుతాయి. వైద్య కళాశాలలను నడపలేము అంటూ కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయడం అన్యాయం. విద్యార్థుల భవిష్యత్ పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఎలా ఉందో అర్థమవుతోంది. మెడికల్ కళాశాలల నిర్మాణ పనులు నిలిపివేయడం సరైన పద్ధతికాదు. పేద విద్యార్థులకు వైద్య విద్య అందకుండా కేవలం ధనికులకే అందేలా ప్రభుత్వం కుట్ర చేస్తోంది.

– బాలాజీ, విద్యార్థి తండ్రి, బంగారుపాళ్యం

ఎంఈవోలపై బాధ్యతల భారం

చిత్తూరు అర్బన్, చిత్తూరు రూరల్ మండలాలకు కలిపి 2019కు ముందు ఒకరే ఎంఈఓ ఉండేవారు. ఆ ఒక్క ఎంఈఓనే ప్రాథమిక పాఠశాలలు 134, ప్రాథమికోన్నత పాఠశాలలు 27, ఉన్నత పాఠశాలలు 68 మొత్తం 229 పాఠశాలలను, అందులో పనిచేస్తున్న రెండు వేల మందికి పైగా టీచర్లు, అకడమిక్ తనిఖీలు, కార్యాలయ పనులు, ఉన్నతాధికారులు చెప్పే పనులు ఇలా అన్నీ ఒక్క ఎంఈఓనే బాధ్యతలు మోయాల్సిన దుస్థితి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎంఈఓ–2ను ఏర్పాటు చేశాక కాస్త ఉపశమనం దొరికింది. మండలంలో ఉండే ఇద్దరు ఎంఈఓల్లో ఎంఈఓ–1 పరిపాలన పనులు, ఎంఈఓ–2 అకడమిక్ పనులు చూసుకునేవారు. ప్రస్తుతం ఎంఈఓ 2 పోస్టులను రద్దు చేస్తుండడంతో ఇకపై బాధ్యతలన్నీ ఒక్క ఎంఈఓనే మోయాల్సిన దుస్థితి నెలకొంది.



జిల్లా వ్యాప్తంగా ఉన్న సీనియర్ ప్రధానోపాధ్యాయులు ఎంఈఓగా ఉద్యోగోన్నతి పొందేందుకు చాలా సంవత్సరాలుగా ఎదురు చూశారు. కొందరేమో ఉద్యోగోన్నతి పొందకుండానే ఉద్యోగవిరమణ పొందారు. సీనియర్ హెచ్‌ఎంలకు ఎంఈఓగా ఉద్యోగోన్నతి పొంది విరమణ పొందాలన్నది వారి కోరిక. అయితే చాలా సంవత్సరాలుగా ప్రమోషన్లు పొందలేక పోయారు. అలాంటి హెచ్‌ఎంల కోరికను గత ప్రభుత్వం నెరవేర్చింది. సీనియర్ హెచ్‌ఎంలకు ఎంఈఓ–2 గా ఉద్యోగోన్నతి కల్పించారు. ప్రస్తుతం వారి ఆకాంక్షలపై కూటమి ప్రభుత్వం నీళ్లు చల్లుతోంది.



- ఎంఈఓ–2 పోస్టులకు మంగళం?
- ఇకపై ఇద్దరు ఎంఈఓల స్థానంలో ఒక్కరే
- పోస్టుల రద్దుకు కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం
- స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు సర్వ అధికారాలు

చిత్తూరు కలెక్టరేట్ : విద్యాభివృద్ధికి కృషి చేయాల్సిన కూటమి ప్రభుత్వం సంస్కరణల పేరుతో ఉన్న ఎంఈఓ పోస్టులను ఎత్తివేస్తోంది. ఉద్దేశపూర్వకంగా ఎంఈఓ–2 పోస్టుల రద్దుకు రంగం సిద్ధం చేస్తోంది. పరిపాలన, అకడమిక్ సౌకర్యాల నిమిత్తం గత ప్రభుత్వం ఎంఈఓ–2 పోస్టులను తీసుకొచ్చింది. ఎంఈఓ–2 పోస్టుల వల్ల ఒక్క ఎంఈఓనే పూర్తి భారం మోయాల్సిన పరిస్థితి తప్పింది. ఎంఈఓ–2 పోస్టులను మంజూరు చేయాలని ఎంఈఓల సంఘ నాయకులు చాలా సంవత్సరాలుగా డిమాండ్ చేస్తున్నారు. ఆ డిమాండ్‌ను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసింది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే ఎంఈఓ–2 పోస్టులకు మంగళం పాడేందుకు సిద్ధమైంది.

ఎంఈఓ అధికారాలు బదలాయింపు

జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం ఎంఈఓ–1కు ఉన్న ఎస్జీటీలకు సంబంధించిన సర్వీస్ అంశాలు, సెలవుల మంజూరు తదితర ఎగ్జిక్యూటివ్ అధికారాలను స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు బదలాయించనున్నారు. తద్వారా పరిపాలనను గాడితప్పించే విధంగా కూటమి సర్కారు వ్యవహరిస్తోంది. ప్రస్తుతం ఉన్న ఎంఈఓ–2లను తొలగించడంతో పాటు ఎంఈఓ–1ను కేవలం తనిఖీ అధికారిగా పరిమితం చేయనున్నారు. కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై ఎంఈఓలు ఆందోళనలో మునిగిపోయారు.

స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు అధికారాలు

జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎంఈఓ–2 పోస్టులను రద్దు చేసి స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు అధికారాలు అప్పజెప్పనున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 250 స్కూల్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. ఆ సంఖ్యను 170 కు కుదించనున్నారు. కుదింపు కసరత్తును జిల్లా విద్యాశాఖ అధికారులు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని ఒక్కొక్క స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోకి కనీసం 38 వరకు సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ)లు ఉండేలా కసరత్తు చేపడుతున్నారు. ఈ కసరత్తు పూర్తయ్యాక ఎంఈఓ–2 పోస్టులను రద్దు చేసి పూర్తి అధికారాలను స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు అప్పగించనున్నారు.





పోస్టుల కుదింపు

జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాలకు సంబంధించి ప్రాథమిక పాఠశాలలు 2,090, ప్రాథమికోన్నత పాఠశాలలు 263, ఉన్నత పాఠశాలలు 523 మొత్తం 2,876 పాఠశాలలున్నాయి. వీటన్నింటిలో 2,39,040 మంది విద్యార్థులు 1వ తరగతి నుంచి 10 వ తరగతి వరకు విద్యనభ్యసిస్తున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 4,233, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 1,406, ఉన్నత పాఠశాలల్లో 5,708 మొత్తం 11,347 మంది టీచర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 31 మండలాల్లో ఎంఈఓ–1 లు 31 మంది, ఎంఈఓ–2లు 31 మంది మొత్తం 62 మంది విధులు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఎంఈఓ–2లు తమ బాధ్యతలను నిర్వర్తిస్తూ సర్కారు పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఇలాంటి సమయంలో కూటమి ప్రభుత్వం సంస్కరణల పేరుతో ఎంఈఓ–2 పోస్టులను కుదించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. జిల్లాలోని 31 మండలాల్లో ఎంఈఓ –2 పోస్టులకు మంగళం పాడేందుకు సిద్ధమైంది.

ఎంఈఓ–2 కొనసాగించాలి



ఎంఈఓ–2 పోస్టులను అలాగే కొనసాగించాలి. ఎంఈఓల వల్ల అకడమిక్ వ్యవహారాలు మెరుగుపడుతున్నాయి. ఇలాంటి సమయంలో పోస్టుల రద్దు అన్యాయం. ఎంఈఓల కు ఉన్న గౌరవాన్ని పోగొట్టకుండా కాపాడాలి. ఎన్నో రోజులుగా వేచి చూసి ఎంఈఓ–2గా సీనియర్ హెచ్‌ఎంలు ఉద్యోగోన్నతి పొందారు. ఇప్పుడు ఆ పోస్టులు రద్దు చేయడం తీరని అన్యాయం.

– గిరిప్రసాద్‌రెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు

రద్దు అన్యాయం



ఎంఈఓ–2 పోస్టులను ఉన్నఫలంగా రద్దు చేసేందుకు ప్రయత్నించడం అన్యాయం. ఎంఈఓ–2 పోస్టులు రద్దు చేయకుండా అలాగే కొనసాగించాలి. స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు బాధ్యతలు అప్పగించడం వల్ల పాఠశాలల పర్యవేక్షణ కుంటుపడే అవకాశం ఉంది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాల్సిన అవసరం ఉంది. ఎంఈఓలకు తీరని ద్రోహం చేయడం తగదు.

– గోపినాథ్, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు

అడుగడుగునా ఆటంకాలు

- ఎంపీ మిథున్ రెడ్డిని అడ్డుకున్న పోలీసులు

పుంగనూరు: నియోజకవర్గ పర్యటనకు వచ్చిన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి పోలీసులు అడుగడుగునా అడ్డంకులు సృష్టించారు. పట్టణానికి సోమవారం వచ్చిన ఎంపీని కృష్ణదేవరాయ సర్కిల్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. అధిక సంఖ్యలో మోహరించిన పోలీసులు కాన్వాయ్ వాహనాలను అనుమతించేది లేదని, రూరల్ సీఐ రాంభూపాల్ పోలీసులతో అడ్డుకున్నారు. దీనిపై ఎంపీ మిథున్ రెడ్డి ఎస్పీతో మాట్లాడారు. ఆ తరువాత ఏడు వాహనాలను మాత్రమే అనుమతించారు. మిగిలిన అనుచరుల వాహనాలను అనుమతించలేదు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో ఎంపీ ప్రజలను కలుసుకునే కార్యక్రమం నిర్వహించారు. అక్కడా పోలీసులు ప్రజలను, కౌన్సిలర్లను అనుమతించకపోవడంతో ఎంపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని కొత్తయిండ్లు, అంబేడ్కర్‌సర్కిల్, గోకుల్ సర్కిల్, తూర్పు మొగసాల, మున్సిపల్ ఆఫీసు వద్ద, కొత్తకోట క్రాస్ వద్ద, చదళ్ల క్రాస్ వద్ద పోలీసులు భారీగా మోహరించారు. వైఎస్సార్‌సీపీ అభిమానులను, కార్యకర్తలను ఎంపీని కలుసుకోనివ్వకుండా అడ్డుకున్నారు. మున్సిపల్ కార్యాలయంలో బాంబ్‌స్క్వాడ్, మెటల్‌డిటెక్టర్లు పెట్టి ప్రజలను సోదాలు చేశారు.



పుంగనూరులో ఎంపీ వాహనాలను అడ్డుకుంటున్న పోలీసులు



వాహనాలను అడ్డుకున్న పోలీసులతో మాట్లాడుతున్న ఎంపీ మిథున్ రెడ్డి

రాజకీయాలు కాదు.. అభివృద్ధిలో ఆదర్శంగా నిలవండి

''రాజకీయాలు ఐదేళ్లకోసారే చేయాలి.. నిజాయితీ ఉంటే పుంగనూరు నియోజకవర్గాన్ని మాకన్నా ఎక్కువగా అభివృద్ధి చేయండి.. ఆదర్శంగా నిలవండి. హ్యుందాయ్ కంపెనీ సహకారంతో పుంగనూరులో ఏర్పాటు చేస్తున్న జర్మన్ పెప్పర్ మోషన్ బస్సులు, ట్రక్కుల కంపెనీ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వండి.. అని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఆయన చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్పతో కలసి పుంగనూరు మున్సిపాలిటీలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని, అభివృద్ధిని గాలికి వదిలేసి, దాడులు, అక్రమ కేసు లపై దృష్టి పెట్టిందని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వాటర్‌గ్రిడ్ ద్వారా సాగునీరు–తాగునీరు అందించేందుకు టెండర్లు పూర్తి చేశామన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన జర్మన్ పెప్పర్‌మోషన్ ఎలక్ట్రికల్ బస్సుల కంపెనీ భూసేకరణ పూర్తి అయిందన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వీటిని పూర్తి చేసి, పుంగనూరు అభివృద్ధికి సహకరించాలన్నారు. ముస్లిం మైనార్టీలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు చట్టం గురించి, అందులోని లోపాల గురించి పార్లమెంటరీ కమిటీకి ఎంపీ విజయసాయిరెడ్డి ద్వారా వినతిపత్రం అందజేశామన్నారు. దేశంలోని అన్నిమతాలు, కులాలు సమానంగా ఉండాలన్నదే వైఎస్సార్‌సీపీ అభిమతం అన్నారు. ఇందుకోసం నిరంతరం పని చేస్తామన్నారు. ముస్లిం మైనార్టీలకు ఇబ్బందులు కలిగించే ఏ బిల్లులైనా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. పుంగనూరు వద్ద శ్రీకాహస్తి పెరాఅలాయి పైపుల ఫ్యాక్టరీ పనులు చురుగ్గా సాగుతున్నాయని, త్వరలోనే ఫ్యాక్టరీ ప్రారంభమవుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పుంగనూరును పారిశ్రామిక కారిడార్‌గా ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. ఈ మేరకు పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు కృషి చేశామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వీటిని అమలు చేసి, అభివృద్ధి చేస్తే మేమే అభినందిస్తామని ఎంపీ స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి



ధ్వజావరోహణంలో వేద పండితులు, ఆలయ సిబ్బంది

బ్రహ్మోత్సవం.. పరిపూర్ణం!

కాణిపాకంలో వినాయక చవితి మరుసటి రోజు నుంచి అంగరంగ వైభవంగా సాగిన బ్రహ్మోత్సవాలు సోమవారం నిర్వహించిన ధ్వజావరోహణంతో పరిపూర్ణమయ్యాయి. ఉత్సవాల్లో ఆఖరిరోజు ఉదయం ఆలయ పుష్కరిణిలో త్రిశూల స్నానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం వడాయత్తు ఉత్సవం, సాయంత్రం ధ్వజావరోణం నేత్ర పర్వంగా సాగాయి. కోలాహలంగా నిర్వహించిన వసంతోత్సవంలో ఆలయ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

– ఐరాల/తవణంపల్లె

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతి

సదుం: బావిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని సోమవారం స్థానికులు గుర్తించారు. పోలీసుల కథనం మేరకు, మండలంలోని భట్టువారిపల్లె సమీపంలో ఉన్న ఆరన్నగారిబావిలో సాయంత్రం గుర్తు వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ షేక్ షా వలి వీఆర్వో మహబూబ్ బాషాతో కలిసి వెళ్లి మృతదేహాన్ని వెలికి తీయించారు. మృతుడి వయసు 55–60 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. వివరాలు తెలిసిన వారు 9440900701 నెంబరుకు, పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

నిప్పు రాజుకుంటున్న చందాల ఘర్షణ

కుప్పం: వినాయక చవితి చందాల విషయంలో మొదలైన ఘర్షణ క్రమంగా నిప్పు రాజుకుంటోంది. ఘర్షణలో ఒక వర్గానికి చెందిన యువకుడు తీవ్రంగా గాయపడడంతో వారందరూ ఏకమయ్యారు. మరోవైపు దాడికి దిగిన వర్గం ఏకతాటిపైకి వస్తోంది. రాజకీయాల కతీతంగా సామాజిక వర్గాలకు చెందిన వైరంగా మారుతోంది. వివరాల్లోకి వెళితే, మున్సిపాలిటీ పరిధిలో ఐదు రోజుల క్రితం విజయలక్ష్మీ రోడ్డులోని వినాయక చవిత పండుగ చందా వసూళ్లపై బాట్లీ కుమారుడు బాలమురుగన్, మాజీ జెడ్పీటీసీ రాజ్‌కుమార్ తమ్ముడు వినయ్ మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఈ ఘర్షణలో వినయ్ తీవ్రంగా గాయపడ్డాడు. అనంతరం చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో బాలమురుగన్ సామాజిక వర్గానికి చెందినవారందరూ రాజకీయాలకతీతంగా ఒక్కటైపోయారు. గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తికి న్యాయం చేయమంటే కుల రాజకీయాలు చేయడంతో అటువైపు సామాజిక వర్గం కూడా మేలుకుంది. దీంతో వినయ్‌కు చెందిన సామాజిక వర్గం వారు కూడా ఏకమయ్యారు. దీంతో కొందరు మధ్యవర్తులు రాజీ చేయడానికి రంగంలోకి దిగారు. దాడి చేసిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోకుంటే తాము ఉద్యమిస్తామని వారు హెచ్చరిస్తున్నారు. దీనిపై పోలీసు శాఖ ఎలా స్పందిస్తుందోనని పట్టణవాసుల్లో ఆందోళన మొదలైంది. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని ఈ వివాదంలో నిప్పు రాజుకుంటున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

బైరెడ్డిపల్లె : గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు బైరెడ్డిపల్లె పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు, మురారిపల్లెకు చెందిన నరసింహులు కుమారుడు చిరంజీవి బైరెడ్డిపల్లె సమీపంలోని గుంతకుర్రపల్లెలో నివాసం ఉంటున్నాడు. బైరెడ్డిపల్లె చెక్‌పోస్టు సమీపంలో బెంగళూరు–చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవేలో వాహనాలు తనిఖీ చేస్తుండగా చిరంజీవి ద్విచక్ర వాహనంపై కిలో గంజాయి తీసుకెళుతుండగా గుర్తించి పట్టుకున్నట్లు చెప్పారు. దీంతో చిరంజీవిపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపుతున్నట్లు తెలిపారు.

విద్యార్థుల జీవితాలతో ఆటలొద్దు..



పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం ఆటలు ఆడకూడదు. నాలాంటి పేదలు తమ పిల్లలను వైద్య విద్య చదివించాలని కలలు కంటుంటాం. అలాంటి వారిని ప్రభుత్వం మోసం చేయకూడదు. ప్రస్తుత ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటుకు ఇచ్చేయడం అన్యాయం. గత ప్రభుత్వం పేదల కోసం మెడికల్ కళాశాలలను కట్టించింది. ఇప్పుడెందుకు ఆ కళాశాలలను ప్రైవేటుకు ఇచ్చేయాలని అనుకుంటున్నారు. వైద్య కళాశాలలపై చంద్రబాబునాయుడు తీసుకుంటున్న నిర్ణయాలు సరైనవి కావు.

– భువనేశ్వరి, విద్యార్థి తల్లి, బంగారుపాళెం



ఎందుకింత కక్ష..!



గత ప్రభుత్వం అమలు చేసిన మెడికల్ కళాశాలల నిర్మాణాలు నాలాంటి పేద విద్యార్థులకు వరం. గతేడాది ఐదు కళాశాలలు ప్రారంభించడంతో ఎంతోమంది పేద, మధ్యతరగతి విద్యార్థులు సీట్లు పొందారు. ఆ కళాశాలల్లో ప్రస్తుతం బాగా చదువుకుంటున్నారు. గతంలో రాష్ట్ర వ్యాప్తంగా వైద్య విద్య చదవాలంటే ఇతర దేశాలు, రాష్ట్రాలకు వెళ్లాల్సిన దుస్థితి. అలాంటి పరిస్థితులను గత ప్రభుత్వం రూపుమాపింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ విషయంలో పునరాలోచించాలి. ప్రస్తుతం నిర్మాణదశలో ఉన్న అన్ని కళాశాలల పనులు వేగవంతంగా పూర్తి చేయించి విద్యాబోధన చేయించాలి.

– కిషన్, నీట్ విద్యార్థి, చిత్తూరు

లింకు నొక్కితే.. ఖాతా ఖాళీ!



కాలంతోపాటు మనుషులూ మారుతున్నారు... టెక్నాలజీ మారుతోంది.. ఆ టెక్నాలజీని అందరికంటే ముందుగా నేరగాళ్లు అందిపుచ్చుకుంటున్నారు. నేరాలకు కొత్త కొత్త మార్గాలకు ఎంచుకుంటున్నారు. ఇంట్లో కూర్చుని ప్రపంచంలో ఏ మారుమూలనో ఉన్న బ్యాంకు ఖాతా నుంచి డబ్బు లాగేసుకుంటున్నారు. ఏళ్ల తరబడి రూపాయి రూపాయి పోగేసిన నగదును క్షణాల్లో మాయం చేసేస్తున్నారు. అధిక మొత్తంగా డబ్బులు వస్తాయని ఆశ చూపి, మన దగ్గర ఉన్న ఖాతా మొత్తం ఖాళీ చేస్తున్నారు. ఇలా కంటికి కనపడకుండా స్మార్ట్ ఫోన్‌లో లింకులు పంపి లక్షలాది రూపాయలు దోచేస్తున్నారు.

- రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు
- క్షణాల్లో మాయమవుతున్న నగదు
- ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయడం శ్రేయస్కరం
- 24 గంటల్లో ఫిర్యాదు చేస్తే మేలు

శ్రీరంగరాజపురం : రోజురోజుకూ సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఫోన్లు చేసి మీ బ్యాంక్ ఖాతా బ్లాక్ అయిందని, మీ సెల్‌ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెప్పాలని.. మీకు లక్కీ డ్రాలో బహుమతి వచ్చిందంటూ వ్యక్తిగత వివరాలు అడగడం, ఫేస్‌బుక్‌తో పాటు, సోషియల్ మీడియాను హ్యాక్ చేసి డబ్బులు డిమాండ్ చేయడం.. లింకులు పంపి ఖాతాల్లోని నగదు ఖాళీ చేస్తున్నారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా పోలీసులు అవగాహన కల్పిస్తున్నా ప్రజల్లో మాత్రం మార్పు రావడం లేదు.

రూ.8 లక్షలు టోకరా

జిల్లాలోని రాళ్లబూదుగూరులో ఆగస్టు 26న సైబర్ మోసగాళ్లు ఒక మహిళకు మీషో పేరుతో స్క్రాచ్ కార్డు వచ్చింది. వారే ఫోన్ చేసి మీరు లక్కీ డ్రాలో రూ.15 లక్షలు గెలిచారు. ఆ మొత్తం కావాలంటే అందుకు గాను జీఎస్టీ చెల్లించాలని ఆమె వద్ద నుంచి కొన్ని దఫాలుగా సుమారు రూ.8 లక్షల వరకు దోచేశారు.

సొంతంగానే నకిలీ సైట్లు

ప్రస్తుతం అందరి వద్ద స్మార్ట్ ఫోన్లు ఉన్నాయి. తక్కువ ధరకే సేవలు అందుతున్నాయి. పల్లె నుంచి పట్టణాలు, నగరం వరకూ ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం వంటి వాటితో డిజిటల్ లావాదేవీలు ఎక్కువయ్యాయి. ఇవన్నీ ప్రైవేటు సంస్థలకు చెందినవే మన సమాచారమంతా వారి చేతుల్లో ఉంటుంది. దీన్ని ఉపయోగించుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. వాట్సాప్, మెస్సేజ్ తదితర లింకులు నొక్కగానే బ్యాంక్ ఖాతాల్లో ఉన్న డబ్బు చేజారిపోతుంది. సైబర్ నేరగాళ్లు సొంతంగా సైట్‌లు, లింకులను తయారు చేస్తుండడంతో ప్రజలు మోసపోతున్నారు.

ప్రత్యేకించి వైబ్‌సైట్...

ఎవరైన సైబర్ నేరగాళ్ల బారిన పడి మోసపోతే కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (www.cyber.crime.govt.in)లేక 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. 24 గంటలు అందుబాటులో ఉండే ఈ వెబ్‌సైట్‌లో మోసం జరిగిన 24 గంటల్లో ఫిర్యాదు చేస్తే ఫలితం ఉంటుంది. మన ఖాతా నుంచి అవతలి వ్యక్తి లావాదేవీలను ట్రాక్ చేసేందుకు అధికారులకు వీలువుతుంది. మోసపోయామని గ్రహించిన వెంటనే సందేహించకుండా ఈ పోర్టల్‌లో రిపోర్టు చేయడం మంచిది.

ఫిర్యాదు చేద్దామిలా..

- ముందుగా 'నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ పోర్టల్‌ను క్లిక్ చేసి హోమ్ పేజీలోకి వెళ్లి 'ఫైల్ ఎ కంప్లెయింట్' ఆప్షన్‌పై క్లిక్ చేయాలి.
- అక్కడ కొన్ని నియమాలు, షరతులు చూపిస్తుంది. వాటిని చదివి యాక్సెప్ట్ చేసి రిపోర్ట్ అదర్ సైబర్‌క్రైమ్ బటన్‌పై క్లిక్ చేయాలి.
- తర్వాత సిటిజన్ లాగిన్ ఆప్షన్ సెలెక్ట్‌చేసి మీ పేరు, ఫోన్ నంబర్, ఈ మెయిల్ వివరాలు ఎంటర్ చేసి రిజిస్టర్ మైబల్ నెంబర్‌కు ఒక ఓటీపీ వస్తుంది.
- ఓటీపీ ఎంటర్ చేసి క్యాప్చా కోడ్‌ను బాక్స్‌లో ఫీల్ చేసి సబ్మిట్ బటన్ నొక్కలి. తర్వాత పేజీలోకి తీసుకెళ్తుంది. అసలు ప్రక్రియ మొదలమ్యేది ఇక్కేడే.
- ఈ పేజీలో ఒక ఫారం కనిపిస్తుంది. దానిలో మనకు జరిగిన సైబర్ మోసం గురించి రాయాలి. కాకపోతే నాలుగు సెక్షన్లుగా విభజించి ఉంటుంది. సాదారణ సమాచారం (జనరల్ ఇన్‌ఫర్మేషన్) బాధితుల సమాచారం (విక్టిమ్ ఇన్ ఫర్మేషన్) సైబర్ నేరానికి సంబంధించి సమాచారం , ప్రివ్యూ అనే సెక్షన్లు ఉంటాయి.
- ప్రతి సెక్షన్‌లో అడిగిన వివరాలను నమోదు చేయాలి. మూడు సెక్షన్లు పూర్తయ్యాక ప్రివ్యూను వెరిఫై చేయాలి. అన్ని వివరాలు సరిగా ఉన్నాయని భావిస్తే సబ్మిట్ బటన్ క్లిక్ చేయాలి.
- తర్వాత ఘటన ఎలా జరిగిందనే వివరాలను నమోదు చేయాలి. నేరానికి సంబంధించిన వంటి వివరాలను స్క్రీన్‌షాట్లు (అకౌంటు ట్రాన్స్‌యాక్షన్) వివరాలను డాక్యుమెంట్స్ వంటి ఆధారాలు, సాక్ష్యాలు అందులో పొందుపర్చాలి. వివరాలను సేవ్ చేసి నేరగాళ్ల గురించి ఏదైనా సమాచారం తెలిస్తే నమోదు చేయాలి.
- అంత వెరిఫై చేసుకున్నాక సబ్మిట్ బటన్ క్లిక్ చేస్తే కన్ఫర్మేషన్ మెసేజ్ వస్తుంది. కంప్లైంట్ ఐడీతో పాటు ఇతర వివరాలతో కూడిన ఈ–మెయిల్ వస్తుంది. తర్వాత అధికారులు దర్యాప్తు ప్రారంభిస్తారు.

1930కి ఫిర్యాదు చేయండి

మోసపోయిన తక్షణమే 1930 నంబర్‌కు కాల్ చేస్తే అక్కడి కాల్ సెంటర్‌లో పనిచేసే సిబ్బంది అన్ని బ్యాంకులు యూపీఐ వ్యాలెట్లకు సంబంధించి ప్రతినిధులు నేరుగా సంప్రదిస్తారు. బాధితుని లావాదేవీల వివరాలన్నీ తీసుకొని ఏ బ్యాంక్ ఖాతా నుంచి డబ్బు పోగొట్టుకున్నాడో తెలుసుకుని ఆ బ్యాంక్ నోడల్ అధికారికి సమాచారం ఇస్తారు. బాధితుని ఖాతాను పరిశీలించి అందులో సొమ్ము ఏ బ్యాంక్ ఖాతాకు బదిలీ అయిందో గుర్తించి సంబంధిత అధికారికి సమాచారమిస్తారు. ఎవరైతే మోసగించి తమ ఖాతాలో డబ్బులు వేసుకుంటారో వారి ఖాతాను బ్యాంక్‌వారు ఫ్రీజ్ చేస్తారు. అంతేకాక బాధితుని ఖాతాలో లావాదేవీలన్నీ బ్లాక్ చేస్తారు. బాధితుడు కచ్చితంగా తమ ఖాతా ఉన్న బ్యాంక్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలి. దగ్గరల్లో ఉన్న పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి. జిల్లా పోలీసు కార్యాలయంలో ఉన్న సైబర్ సెల్‌ను కూడా సంప్రదించాలి.

అత్యాశకు పోవద్దు



అత్యాశకు పోయి ఉన్నది పోగొట్టుకోవద్దు. ముఖ్యంగా మీ పాస్‌వర్డ్‌ను భద్రంగా ఉంచుకోండి. వాటిని ఎవరితోను పంచుకోవద్దు. ఎప్పటికప్పుడు పాస్‌వర్డ్‌లను మారుస్తూ ఉండండి. మోసపోయిన వెంటనే జిల్లా పోలీసు వాట్సాప్ నెంబర్ : 9440900005కు లేకపోతే సైబర్ మిత్ర 9121211100కు లేక జిల్లా పోలీసు కార్యాలయం, ప్రశాంత్ నగర్, చిత్తూరులో ఫిర్యాదు చేయ్యవచ్చు.

– మణికంఠ చందోలు, ఎస్పీ

అవగాహన కల్పిస్తున్నాం



సైబర్ నేరాల నియంత్రణపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలోని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి పోలీసు స్టేషన్‌కు సైబర్ వారియర్లను నియమించాం. సైబర్ నేరాలకు గురైతే వెంటనే స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. అనుమానిత లింక్‌లను ఎలాంటి పరిస్థితుల్లోను తెరవకూడదు.

–హనుమంతప్ప, సీఐ, కార్వేటినగరం

ఆల్ ఇండియా టీచర్స్ ఫెడరేషన్ సెక్రటరీగా గిరిప్రసాద్‌రెడ్డి



నేషనల్ కమిటీ సమావేశంలో జ్ఞాపికను అందుకుంటున్న గిరిప్రసాద్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : ఆల్ ఇండియా టీచర్స్ ఫెడరేషన్ సెక్రెటరీగా పీఆర్‌టీయూ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ లక్నోలో నిర్వహించిన నేషనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో పలు రాష్ట్రాల నుంచి ఉపాధ్యాయ సంఘాలు పాల్గొన్నట్లు తెలిపారు. తనకు ఆల్ ఇండియా టీచర్స్ ఫెడరేషన్‌లో నేషనల్ సెక్రటరీగా అవకాశం కల్పించడం ఆనందకరమన్నారు.

సీటు కోసం బ్యాగు వేస్తే బంగారం పాయె..!

- పోలీస్ స్టేషన్‌కు బాధితురాలి పరుగులు

చిత్తూరు అర్బన్: సీటు కోసం బస్సు కిటికీ లోంచి బ్యాగు వేస్తే రూ.4లక్షల నెక్లెస్ కొట్టేశార్రా దేవుడా..!అని ఓ మహిళ గగ్గోలు పెట్టింది. ఆపై పోలీస్ స్టేషన్‌కు పోయి బావురుమంది. బాధితురాలి కథనం మేరకు..బెంగళూరుకు చెందిన లక్ష్మి తిరుపతిలో తన బంధువుల వివాహానికి హాజరై తిరిగి చిత్తూరు బస్టాండుకు వచ్చారు. బెంగళూరు వెళ్లే బస్సులన్నీ ప్రయాణికులతో నిండిపోయాయి. ఇంతలో కర్ణాటక బస్సు రావడంతో పొలోమంటూ ప్రయాణికులు ఆ బస్సుకు ఎగబడ్డారు. సీటు కోసం నువ్వా, నేనా? అంటూ తోపులాటల నడుమ బస్సు ఎక్కేందుకు యత్నించారు. పరిస్థితి చూసిన లక్ష్మి ఎలాగైనా సీటు దక్కించుకోవాలని కిటికీలోంచి ఒక సీట్‌లోకి హ్యాండ్ బ్యాగు వేసింది. ఆపై బస్సు ఎక్కి చూస్తే తాను బ్యాగు వేసిన సీటులో ప్రయాణికులు కూర్చుని ఉండడంతో చేసేదిలేక మరో బస్సు ఎక్కేందుకు దిగేసింది. కాసేపటికి బ్యాగు తెరచి చూసేసరికి ఆమెకు గుండె ఆగినంత పనైంది! 64 గ్రాముల బరువున్న బంగారు నెక్లెస్ కనిపించకపోవడంతో లబోదిబోమంది. అప్పటికే ఆ కర్ణాటక బస్సు కూడా వెళ్లిపోయింది. దీంతో బాధితురాలు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించింది. దీనిపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

జాతీయ స్థాయి ఖో–ఖో పోటీలకు ఎంపిక



లక్ష్మి

వి.కోట: జాతీయ స్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీలకు తమ స్కూల్లో 9వ తరగతి చదువుతున్న లక్ష్మి ఎంపికైందని మండలంలోని పాముగానిపల్లె జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం రవీంద్రనాథ రెడ్డి సోమవారం తెలిపారు. ఇటీవల రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ నెల 28న రాంచీలో జరిగే జాతీయ స్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీల్లో చిత్తూరు జిల్లా నుంచి మన రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తుందని చెప్పారు. లక్ష్మిని, ఆమెకు శిక్షణ ఇచ్చిన పీడీ సురేష్ కుమార్‌ను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

దళిత దంపతులపై పోలీసు కుటుంబం దాడి



గాయపడ్డ గురురాజా

గంగవరం: దళిత దంపతులపై పోలీసు కుటుంబం విచక్షణా రహితంగా దాడి చేసిన ఘటన మండలంలో సోమవారం వెలుగు చూసింది. బాధితుడి కథనం మేరకు మండలంలోని సుబ్బరాయప్పకుంట వద్ద గురురాజా, అతని భార్య రత్నమ్మ నివాసం ఉంటున్నారు. అదే ప్రాంతంలో కానిస్టేబుల్ సుబ్రమణ్యంనాయుడు, ఆయన కుటుంబంతో నివాసం ఉంటున్నారు. ఈయన ఎస్ఆర్‌పురం పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే వాళ్ళ నివాసాల పక్కనే ప్రభుత్వ స్థలంలో ఇద్దరికీ చెందిన వాహనాలను పార్కింగ్ చేసుకునే క్రమంలో కొంత ఘర్షణ చోటు చేసుకుంది. రెండు రోజుల క్రితం కానిస్టేబుల్‌కు చెందిన కారు పక్కన గురురాజా బైక్‌ను పార్కింగ్ చేసుకునేవారు. కానిస్టేబుల్ కుమారుడు నవీన్ గురురాజా బైక్‌ను పక్కకు ఈడ్చి పడేశాడు. స్కూటర్‌ని ఎందుకు పక్కకు పడేశావని అడిగినందుకు కులం పేరుతో దూషిస్తూ దళిత కుటుంబంపై దాడి చేసి గాయపరిచారు. బెంగళూరు నుంచి తన మనుషులను తీసుకొచ్చి అంతు చూస్తాం అంటూ బెదిరించారు. ఈ ఘటనపై గంగవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాల్ బ్యాడ్మింటన్‌లో చిత్తూరుదే అగ్రస్థానం



రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన చిత్తూరు జిల్లా జట్టు



స్టార్ ఆఫ్ ఆంధ్రగా ఎంపికైన శ్రీకాళహస్తికి చెందిన ప్రశాంతి

- జాతీయ స్థాయి పోటీలకు ముగ్గురు క్రీడాకారుల ఎంపిక
- స్టార్ ఆఫ్ ఆంధ్రగా నగరికి చెందిన తేజేష్, శ్రీకాళహస్తికి చెందిన ప్రశాంతి
- బెస్ట్ అప్‌కమింగ్ ప్లేయర్‌గా నగరికి చెందిన లక్ష్మీనారాయణ

నగరి : కాకినాడ జిల్లా అన్నవరంలో ఈ నెల 13,14,15 తేదీల్లో నిర్వహించిన 9వ సబ్ జూనియర్ అంతర్‌జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టు అత్యంత ప్రతిభను కనభరచి మొదటి స్థానంలో నిలిచిందని ఉమ్మడి చిత్తూరు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ బి.జగన్నాథనాయుడు, అధ్యక్షులు వెంకటస్వామి తెలిపారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి 20 జట్లు 260 మంది క్రీడాకారులు ఈ పోటీలో పాల్గొన్నారని చెప్పారు. ఉత్కంఠ భరితంగా సాగిన ఈ పోటీల్లో బాలుర విభాగంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. జాతీయ స్థాయి పోటీలకు బాలుర జట్టు నుంచి కేసీ తేజేష్ (నగరి), వీసీ హేమచరణ్ (శ్రీకాళహస్తి) ఎంపిక కాగా, బాలికల జట్టు నుంచి ఆర్. ప్రశాంతి (శ్రీకాళహస్తి) ఎంపికైందన్నారు. నగరికి చెందిన కేసీ తేజేష్, శ్రీకాళహస్తికి చెందిన ప్రశాంతి స్టార్ ఆఫ్ ఆంధ్ర గాను, లక్ష్మీనారాయణ బెస్ట్ అప్‌కమింగ్ ప్లేయర్‌గాను అవార్డు అందుకున్నారు. జాతీయజట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 25వ తేదీ నుంచి హర్యానా, రోథక్‌లో జరిగే 43వ సబ్‌జూనియర్ నేషనల్ బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. స్టార్ ఆఫ్ ఆంధ్ర, బెస్ట్ అప్‌కమింగ్ ప్లేయర్ అవార్డులు అందుకున్న క్రీడాకారులను, జాతీయ జట్టుకు ఎంపికైన క్రీడాకారులను బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి పి.బాలాజి, కోచ్‌లు టి.గోపి, జయచంద్ర, మేనేజర్లు సుజాత, వివి చంద్రశేఖర్, వి.చెంచురత్నం, మునికృష్ణ, నరేష్, అసోసియేషన్ సభ్యులు, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

వరుణుడి జాడేదీ..!



యర్లంపల్లెలో వేరుశనగ పంట ఎండిపోవడంతో ఆందోళన చెందుతున్న రైతు

- ఎండిపోతున్న వేరుశనగ పంట
- వర్షం పడకుంటే తీవ్ర నష్టమే
- అప్పలు చేసి వేరుశనగ సాగు
- వెంటాడుతున్న కష్టాలు

ఐరాల: మండల వ్యాప్తంగా కరువు ఘంటికలు మోగుతున్నాయి. వరుణుడి జాడలేదు. వర్షాభావం వెంటాడుతోంది. వేరుశనగ సాగు చేసిన అన్నదాతల ఆశలు వాడి ఎండుముఖం పట్టాయి. సాగు కోసం పెట్టిన పెట్టుబడి కూడా రైతన్నలకు వచ్చే పరిస్థితి లేదు. మండలంలో 345 హెక్టార్లలో వేరుశనగ పంట సాగు చేశారు. వర్షాలపై నమ్మకం పెట్టుకుని పంట వేశారు. వరుణుడు ముఖం చాటేయడంతో చినుకు జాడలేక ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగ పంట నిలువునా ఎండుతోంది. వానాకాలంలో కూడా ఎండలు మండుతున్నాయి. పంటలు చేతికి అందక అన్నదాతలకు అప్పులే మిగులుతున్నాయి. రెక్కలు ముక్కలు చేసుకుని ఆరుగాలం శ్రమిస్తూ వేరుశనగ సాగు చేసిన రైతులకు వాతావరణం కలిసి రావడం లేదు. అప్పోసప్పో చేసి పంట సాగు చేయడం.. వర్షం రాకపోవడంతో వరుస నష్టాలను చవి చూస్తున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా చినుకు రాలక కళ్లెదుటే వేరుశనగ పంట నిలువునా ఎండిపోతుండడంతో రైతన్నలు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. కీలకమైన సమయంలో వాన జాడ లేదు. ఆకాశం వైపు ఆశగా చూసినా చినుకుల సవ్వడి లేదు. మరోవైపు భానుడి వేడికి వేరుశనగ పంట జీవం కోల్పోయింది. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పంట సాగు చేశామని, చివరికి ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి..

ఎండిపోయిన వేరుశనగ పంట నష్టాన్ని పరిశీలించి పెట్టుబడి రాయితీ లేదా పరిహారం ప్రభుత్వం చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. వర్షాలు లేక అన్నదాతలు ఆర్థికంగా కుంగిపోతున్నారు. వ్యవసాయాధికారులు సమస్య తీవ్రతను ప్రభుత్వ దృష్టి తీసుకెళ్లి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కనీసం పంట చేతికందితే పశువులకు గ్రాసంగా ఉపయోగపడుతుందని రైతులు చెబుతున్నారు.

గ్రామ బహిష్కరణ

బైరెడ్డిపల్లె: మండలంలోని పెద్దచల్లారగుంట పంచాయితీ పరిధిలో ఉన్న కుమ్మరగుంట గ్రామానికి చెందిన ఓ కుటుంబాన్ని గ్రామ బహిష్కరణ చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బాధితుల కథనం మేరకు, కుమ్మరగుంటకు చెందిన వడ్డెర కుటుంబీకులు గంగరాజు, మణి, శంకరప్పకు 4.6 ఎకరాల భూమి కామిదొడ్డి గంగమ్మ ఆలయం సమీపంలో ఉంది. ఇది వరకే ఆలయానికి తమ వంతు సహాయంగా 39 సెంట్ల భూమిని విరాళంగా అందజేశారు. అయితే తమ అనుమతి లేకుండానే మరో 48 సెంట్ల భూమిని ఆలయానికి చెందినదంటూ ఆక్రమించారు. ఈ విషయమై గ్రామ పెద్దల దృష్టికి తీసుకెళ్లడంతో తమ కుటుంబాన్ని బహిష్కరించినట్లు చెప్పారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ మాధవ రాజు, పోలీసులు గ్రామంలో విచారణ చేపడుతున్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో ఆదివారం అర్ధరాత్రి వరకు 85,626 మంది స్వామివారిని దర్శించుకోగా 33,138 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీ ఆదాయం రూ. 3.13 కోట్లు వచ్చింది. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.